క్లుప్తంగా

శ్రీవారి సేవలో ప్రముఖులు




తిరుమల ఆలయం వెలుపల సినీ నటి గౌతమి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సలహాదారు జయప్రకాష్ సాయి

తిరుమల: సినీనటి గౌతమి మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆమెకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించారు. అధికారులు, లడ్డూ ప్రసాదాతో సత్కరించారు. అదేవిధంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సలహాదారు డాక్టర్ జె.జయప్రకాష్ సాయి కూడా బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన మేరకే ఫీజులు



మాట్లాడుతున్న ఎంఈఓ బాబ్జీ

పాకాల: రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకే ఫీజులు వసూలు చేయాలని ఎంఈఓ బాబ్జీ అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీలో ప్రైవేట్ పాఠశాలల హెచ్ఎంలు, సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలని, ఫీజులు పెంచాలంటే ముందుగా అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 3వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని, వెనుకబడిన వారిని గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.

విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభం



పాకాల: మండలంలోని ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ ఆవరణలో 54 అడుగుల సుబ్రమణ్యస్వామి విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. దీనిపై ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి మాట్లాడుతూ.. పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విగ్రహ నిర్మాణానికి విరాళాలు అందజేసే భక్తుల పేర్లను ఆలయం వద్ద శిలాఫలకంపై నమోదు చేస్తామన్నారు. వివరాలకు చైర్మన్ 9441043479, ప్రధాన అర్చకుడు కృష్ణమూర్తి శర్మ 9440243528, మేనేజర్ ప్రకాష్ 9491580572లను సంప్రదించాలని కోరారు.

అలేఖ్యకు డాక్టరేట్



తిరుపతి ఎడ్యుకేషన్: ఎస్వీయూలో బయోకెమిస్ట్రీ విభాగం పరిశోధక విద్యార్థిని అలేఖ్య డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ప్రొఫెసర్ ఓవీఎస్.రెడ్డి మార్గదర్శకత్వంలో ‘బయోకెమికల్ స్టడీస్ ఆఫ్ పెక్టినేజ్ ప్రొడక్షన్ అండ్ ఇట్స్ క్యారక్టరైజేషన్ ఫ్రం ఏ బ్యాక్టీరియల్ ఐసోలేట్’ అనే అంశంపై ఈమె పరిశోధన చేశారు. పరిశోధక గ్రంథాన్ని సమర్పించడంతో ఎస్వీయూ డాక్టరేట్ డిగ్రీ అందజేసింది.

తిరుమలకు మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



నిందితుడితో ఎస్ఈబీ సీఐ

తిరుమల: తిరుమలకు మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తిని తిరుమల పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఈబీ సీఐ తిరుమలయ్య తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా కిర్మీరుగైకు చెందిన ఎల్.యువరాజ్ ఓ బ్యాగ్‌తో తిరుపతి అలిపిరి తనిఖీ కేంద్రంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఎస్ఈబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా అతని వద్ద ఆరు మద్యం సీసాలను గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

17న మూలవిరాట్ తొలగింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయమైన శ్రీప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ఈనెల 17న మూలవిరాట్‌ను తొలగించనున్నట్లు పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం వరదరాజస్వామి ఆలయాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరదరాజస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.

మేలుకో.. తెలుసుకో

- నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం





తిరుపతి లీగల్: కొనే ప్రతి వస్తువు, సేవలో లోపం లేకుండా సరైన ధర, తూకం, నాణ్యత, స్వచ్ఛత కలిగిన వస్తువులను పొందే హక్కు వినియోగదారులకు ఉంది. కానీ ప్రస్తుత కాలంలో మోసాలు ఎక్కువయ్యాయి. కొందరు ఎందుకులే అనే ధోరణితో.. మరికొందరు ఎలా న్యాయం పొందాలో తెలియక మిన్నకుండిపోతున్నారు. ఇలాంటి వారికి వినియోగదారుల హక్కుల చట్టం అండగా నిలుస్తోంది. వినియోగదారుల హక్కుల కమిషన్ వినియోగదారుల నష్టాన్ని నివారించి న్యాయం అందించడంతో పాటు మరెవ్వరూ మోసపోకుండా ఉండేందుకు సంబంధిత కంపెనీలు, సంస్థలకు భారీ జరిమానాలు విధిస్తూ వినియోగదారులకు అవగాహన కల్పిస్తోంది. నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా సాక్షి అందిస్తున్న కథనం...

చట్టం పుట్టుక

అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ వినియోగదారుల హక్కులను గుర్తించి 1962 మార్చి 15న అమెరికా కాంగ్రెస్ దృష్టికి తీసుకెళ్లారు. మొదటి ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని 1983 మార్చి 15వ తేదీ నుంచి ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. మన దేశంలో 1986లో వినియోగదారుల చట్టాన్ని తీసుకొచ్చారు. 2019లో భారత పార్లమెంట్ వినియోగదారుల హక్కుల చట్టంలో కొన్ని సవరణలను తీసుకొచ్చింది.

వినియోగదారుడు అంటే

ఏదైనా వస్తువును, సేవను సొమ్ము చెల్లించి లేదా కొంత సొమ్ము చెల్లించి పొందినవారిని వినియోగదారుడు అంటారు.

వినియోగదారుల హక్కులు

మార్కెట్‌లోని వస్తువులు మానవుని ప్రాణానికి హాని కలించేది ఏదైనా, ఆస్తికి నష్టం కలిగించినప్పుడు, వస్తువు ధర, సేవలతో పాటు వస్తువు బరువు, నాణ్యత, శక్తి, స్వచ్ఛత, ప్రామాణికం, ధర, సేవలు, అన్యాయమైన వాణిజ్య పద్ధతుల నుంచి వినియోగదారుడు రక్షణ పొందవచ్చు.

ఫీజుల వివరాలు

వినయోగదారుడు రూ.5లక్షల లోపు పరిహారం పొందే ఫిర్యాదులకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. రూ.5లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు పరిహారం పొందాలంటే రూ.500, రూ.10 లక్షల నుంచి రూ. 20లక్షల పరిహారం పొందాలంటే రూ.800 ఫీజు ప్రభుత్వానికి చెల్లించి ఫిర్యాదు దాఖలు చేయాల్సి ఉంటుంది. రూ.50లక్షల నుంచి రూ. కోటి వరకు పరిహారం పొందాలనుకుంటే వినియోగదారుల రాష్ట్ర కమిషన్‌లో, ఆపై పరిహారం పొందాలనుకుంటే జాతీయ కమిషన్‌లో ఫిర్యాదు దాఖలు చేయాలి.

జిల్లా వినియోగదారుల కమిషన్ పరిధి

వినియోగదారుడు రూ.50లక్షలలోపు పరిహారం పొందాలనుకుంటే ఫిర్యాదులను జిల్లా వినియోగదారుల కమిషన్ దృష్టికి తీసుకెళ్లొచ్చు. ఒక వస్తువు ఏ ప్రదేశంలో కొనుగోలు చేసినా తాను నివాసముంటున్న వినియోగదారుల కమిషన్ పరిధిలో ఫిర్యాదు చేయవచ్చు.

రశీదు పొందాలి



ఎవరైనా ఒక వస్తువును కొంటే షాపు నుంచి తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి. ఒక వస్తువును కొని మోసపోయినట్లు గుర్తిస్తే వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేయాలి. మోసాలు పెరిగిపోతున్న నేపథ్యంలో వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి. -జి.గురుప్రసాద్, న్యాయవాది తిరుపతి

డిజిటల్ వ్యవస్థపై అవగాహన కల్పించాలి



ప్రస్తుతం దేశ వ్యాప్తంగా డిజిటల్ వ్యవస్థ అన్ని రంగాల్లో విస్తరిస్తోంది. దీంతో రోజు రోజుకు మోసాలు పెరుగుతోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. -మునిబాలసుబ్రమణ్యం, న్యాయవాది, తిరుపతి

వేగవంతంగా మాస్టర్ ప్లాన్ రోడ్లు



మాస్టర్ ప్లాన్ రోడ్లపై సూచనలు చేస్తున్న కమిషనర్ అనుపమ అంజలి



గొల్లవానిగుంట మాస్టర్ ప్లాన్ రోడ్డును పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

- ఏప్రిల్ చివరికి ఇండోర్ స్టేడియం అందుబాటులోకి..
- కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయనున్నట్లు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులను అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. కొర్లగుంట మెయిన్ రోడ్డు, చింతలచేను, హీరోహోండా షోరూం, అంకురా హాస్పిటల్ ప్రాంతాల్లో అభివృద్ధి చేస్తున్న రోడ్లను సందర్శించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. నాణ్యతగా ఉండాలని.. అనుకున్న సమయానికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలన్నారు. ఇంజినీర్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిష్టాత్మకంగా 14 మాస్టర్ ప్లాన్ రోడ్లను ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే పూర్తి చేసిన అన్నమయ్య మార్గ్, వైఎస్సార్ మార్గ్ రోడ్లు నగరానికి ప్రధాన రహదారులుగా మారాయన్నారు. కొంత ట్రాఫిక్ ఒత్తిడి తగ్గిందన్నారు. కార్పొరేషన్ చేపట్టిన 14 రోడ్లు పూర్తిగా అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్య మరింత తగ్గు ముఖం పడుతుందన్నారు. నగర విస్తరణకు, అభివృద్ధికి ఈ రోడ్లు ఎంతగానో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. వీటినైనంత తొందరగా ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఇందిరా మైదానంలో చేపట్టిన ఇండోర్ స్టేడియం ఏప్రిల్ చివరినాటికి అందుబాటులోకి తెస్తామన్నారు. పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. అదనపు కమిషనర్ సునీత, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డిప్యూటీ సిటీ ప్లానర్ దేవికుమారి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రమ్మణ్యం, షణ్ముగం, డీఈలు సంజీవ్ కుమార్, మహేష్ పాల్గొన్నారు. అలాగే గొల్లవానిగుంట మాస్టర్ ప్లాన్ రోడ్డును డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యుడు బాబు, కార్పొరేటర్ ఆంజనేయులు, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి పరిశీలించారు.

కోదండరాముని బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

-టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామాలయంలో ఈనెల 20 నుంచి 28వ తేదీ వరకు జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అన్ని విభాగాల అధికారులు సమష్టిగా కృషి చేసి విజయవంతం చేయాలని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 20న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈనెల 22న ఉగాది అస్థానం, 24న గరుడ సేవ, 25న హనుమంత వాహన సేవ జరుగుతాయని వివరించారు. అదే విధంగా ఈనెల 31న శ్రీసీతారాముల కల్యాణం, 30 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు, ఏప్రిల్ 3 నుంచి 5వ తేదీ వరకు స్వామి వారి తెప్పోత్సవాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ మేరకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. మెరుగైన పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. టీటీడీ ఎస్ఈ ఎలక్ట్రికల్ వెంకటేశ్వర్లు, ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, గోశాల డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి, డిప్యూటీ ఈఓలు గోవిందరాజన్, లోకనాథం, శాంతి, ఆలయ అర్చకులు ఆనందకుమార్ దీక్షితులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు రీపోలింగ్ నిర్వహించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

తిరుపతి కల్చరల్: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల రీపోలింగ్ జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో అఖిలపక్ష పార్టీలతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలు సజావుగా జరపడంలో రాష్ట్ర ఎన్నికల సంఘం విఫలమైందన్నారు. డీజీపీ రాజేంద్రనాథ్ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్నారని అన్నారు. ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.అంజయ్య, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కాంగ్రెస్ నేత మాంగాటి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పెద్దల సభకు జరిగిన ఎన్నికల్లో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శి పి.మురళి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

చంద్రగిరి: ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. చంద్రగిరి ప్రభుత్వ బాలికల కళాశాల, బాలికల పాఠశాల, బాలుర కళాశాల, బాలుర పాఠశాల, రామిరెడ్డిపల్లిలోని నారాయణ బాలుర, బాలికల కళాశాలతో కలిపి మొత్తం 6 సెంటర్లలో విద్యార్థులు పరీక్షలను రాయనున్నారన్నారు. 6 సెంటర్లలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సుమారు 3,430 మంది పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. పరీక్ష హాలులో సీసీ కెమెరాలు, తాగు నీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచే విద్యార్థులను వారి సెంటర్లకు అనుమతిస్తామని చెప్పారు. ఉదయం 9 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుతించేది లేదని స్పష్టం చేశారు.

నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం



భాకరాపేట: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యాధికారిణి

- పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

తిరుపతి తుడా: పిల్లల కడుపులోని నులి పురుగులను అంతమొందిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం విద్యార్థులకు ఆల్బెండజోల్ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేతులు శుభ్రంగా ఉంచుకోకపోవడం, మట్టి లో ఆడుకుంటుండడం వల్ల పిల్లల కడుపులో కొంకి పురుగు, నులి పురుగు, బద్దె పురుగు, గుండ్రని పురుగులు ఆవాసాలుగా ఉంటాయన్నారు. ఆ పురుగులను నివారించేందుకు ఆల్బెండజోల్ 400 ఎంజీ మందులను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు రవిప్రభ, మధుసూదన్ రెడ్డి, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

భాకరాపేట: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్న గొట్టిగల్లు మండల వైద్యాధికారిణి శశికళ వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యులు తేజస్వి, సీహెచ్ఓ శేషకుమారి పాల్గొన్నారు.

ఏడాదిలో రెండుసార్లు తీసుకోవాలి

రామచంద్రాపురం: ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు తప్పనిసరిగా ఏడాదిలో రెండుసార్లు నులిపురుగులకు మందులు తీసుకోవాలని కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి హేమలత అన్నారు. మండలంలోని సీరామాపురంలోని వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులకు నులిపురుగుల నివారణకు మందులు వేశారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, కాలేయం, ఊపిరితిత్తులు, పెద్దపేగులకు సమస్యలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. నులిపురుగులను నివారించకపోతే శారీరక, మానసిక ఎదుగుదల తగ్గుతుందన్నారు.



తిరుపతిలో..



రామచంద్రాపురం: కమ్మపల్లి పీహెచ్‌సీలో..

49 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 49 మందికి రూ.98 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ మంగళవారం తీర్పు చెప్పినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరి తెలిపారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసులు 49 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

సహకార బంధుతో ఎంతో ప్రయోజనం

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరులోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో ఖాతాదారులకు అందుబాటులోకి తీసుకొచ్చిన సహకార బంధు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ కీర్తి సుధ కోరారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ... సహకార బంధు పథకం ద్వారా సీనియర్ సిటిజన్స్‌కు 8శాతం వడ్డీ ఇస్తున్నట్లు తెలిపారు. డిపాజిట్ స్వీకరణ ఇప్పటికే ప్రారంభమైందని, ఈనెల 20వ తేదీ వరకు డిపాజిట్లు స్వీకరిస్తామని చెప్పారు. ఇతర బ్యాంకులకన్నా జిల్లా సహకార బ్యాంకులో పొదుపు చేయడం ద్వారా అత్యధిక వడ్డీని పొందవచ్చని తెలిపారు. డిపాజిట్లకు డీఐసీజీసీ ఇన్సూరెన్స్ రక్షణ కూడా ఉంటుందన్నారు.

ప్రసాదాల వాహనం ప్రారంభం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రసాదాల తరలింపు వాహనాన్ని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మంగళవారం ప్రారంభించారు. ముందుగా వాహనానికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోటులో ప్రసాదాలను తరలించేందుకు ఇబ్బందికరంగా ఉండడంతో రూ.5లక్షలతో బ్యాటరీ వాహనాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీని వల్ల లడ్డు పోటు నుంచి ప్రసాదాలు తరలించేందుకు సులభంగా ఉంటుందన్నారు. లడ్డు పోటు ఇన్‌చార్జి మునిరెడ్డి, ఆలయ అధికారులు హిమబిందు, సుదర్శన్‌నాయుడు, సుదర్శన్‌రెడ్డి, అర్చకులు కమల్ గురుకుల్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పాకాల: మండలంలోని బందార్లపల్లికి సమీపంలో ఉన్న మామిడి తోటలో మంగళవారం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. బందార్లపల్లికి సమీపంలోని రవీంద్రనాథ్‌రెడ్డి మామిడి తోటలో చెట్టుకు ఉరి వేసుకుని ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడు ఇరంగారిపల్లి పంచాయతీ తలారిపల్లి గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు తలారి హరిబాబు(40)గా స్థానికులు గుర్తించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

వేడుకగా ఆలయ కుంభ ఆరాధన



కలశ స్థాపన చేస్తున్న వేద పండితులు

తిరుపతి కల్చరల్: మంగళం రోడ్డులోని ఉపాధ్యాయ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా రెండో రోజు మంగళవారం ఆలయంలో విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా వేద పండితులు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, వాస్తు హోమం శాస్త్రోక్తంగా చేశారు. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠ, కుంభదేవ ఆవాహనం, కలశ స్థాపన తదితర పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పైడా శ్రీనివాసులురెడ్డి, తోట నరసింహులు నాయుడు పాల్గొన్నారు.

పాముకు పూజలు



భాకరాపేట: చిన్నగొట్టిగల్లు శివాలయం వద్ద నాగు పాముకు పూజలు చేశారు. మంగళవారం మధ్యాహ్నం శివాలయం సమీపంలో నాగుపాము పడగ విప్పి ఆడుతుండగా పిల్లలు ఫోన్‌లో చిత్రీకరించారు. విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడికి వెళ్లి పాముకు పూజలు చేశారు.

శతాధిక వృద్ధుడి మృతి



మునిరత్నం నాయుడు

తిరుపతి తుడా: శతాధిక వృద్ధుడు మృతిచెందిన ఘటన పాకాల మండలంలో చోటు చేసుకుంది. దామలచెరువు మాజీ సర్పంచ్ వంకాయల పాటి మునిరత్నం నాయుడు 1922లో జన్మించారు. 1964–1970 మధ్య కాలంలో సర్పంచ్‌గా సేవలందించారు. ఈయనకు ముగ్గురు కుమారులు. మొదటి కుమారుడు ప్రొఫెసర్ రెడ్డెప్ప నాయుడు ఎస్వీ యూనివర్సిటీ సోషియాలజీ విభాగంలో పదవీ విరమణ చేశారు. వృద్ధాప్యం నేపథ్యంలో మునిరత్నం మంగళవారం తుది శ్వాస విడిచారు. బుధవారం మధ్యాహ్నం మల్లప్పగారిపల్లెలో దహన సంస్కారాలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎమ్మెల్యే వివాహ కానుక పంపిణీ



ఎమ్మెల్యే వివాహ కానుకను అందజేస్తున్న ఎంపీపీ

చంద్రగిరి: ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పంపిన వివాహ కానుకను మండలంలోని మిట్టపాళెం పంచాయతీ కొత్తూరు హరిజనవాడకు చెందిన సుమతి, అశోక్ కుమార్‌లకు మంగళవారం అందజేశారు. ఇందులో బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, బాచికం, మహార్నపు పట్టు వస్త్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, అమ్మవారి పసుపు–కుంకుమ ఉన్నాయి. ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు పసల నాగరాజు, సర్పంచ్ బోయరెడ్డి ప్రవీణ్ కుమార్ రెడ్డి వీటిని అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు ఎం.భాస్కర్‌రెడ్డి, చంచయ్య ఉన్నారు.

నియామకం



హరిసర్వోత్తమ నాయుడు

తిరుపతి కల్చరల్: అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీకళావేదిక జాతీయ అధికార ప్రతినిధిగా ప్రముఖ కవి, రచయిత గుత్తా హరిసర్వోత్తమ నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రపంచ తెలుగు సాహిత్య, సాంస్కృతిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రమేష్ నారాయణ, సాకే నరేష్, గోపాలకృష్ణ, టీవీ రెడ్డి, రామాంజనేయులు, పేరూరు బాలకృష్ణ హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

ఏప్రిల్ 9,10న తిరుపతిలో ప్రపంచ రికార్డు సభలు

శ్రీశ్రీ కళావేదిక, చేజర్ల ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా ఏప్రిల్ 9,10 తేదీల్లో తిరుపతి మహతి కళాక్షేత్రంలో 48 గంటల పాటు ప్రపంచ రికార్డు కార్యక్రమం నిర్వహించనున్నారు. కవులు, కళాకారుల ప్రోత్సాహం కోసం ప్రపంచ కవితోత్సవం, సాహిత్య సదస్సులు, కళాప్రదర్శనలు నిర్వహించనున్నారు.